‘సిద్ధాపురం’.. పంటలు సస్యశ్యామలం

- వెలుగోడు రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి నీటి విడుదల
- వేల ఎకరాల్లో మాగాని పంటల సాగు
- ఆనందంలో అన్నదాతలు

ఆత్మకూరు: వెలుగోడు రిజర్వాయర్ నుంచి సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి సాగు నీరు విడుదల కావడంతో మండలంలోని సిద్ధాపురం, కొత్తరామాపురం, కరివేన గ్రామాలకు చెందిన చెరువులతో పాటూ మరో 8 గ్రామాలకు చెందిన రైతులు కృష్ణా జలాలతో మాగాని పంటలు సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. నీటి విడుదలతో ఆత్మకూరు మండలంలోని రైతన్నల మోములో చిరునవ్వులు చిగురించాయి.

మెట్ట పంటలతో పాటు వరి సాగు

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా గతనెల 25న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సాగునీరు విడుదల చేయడంతో పథకం కింద పంటలకు నీరు పుష్కలంగా అందే అవకాశం ఉండడంతో రైతులు సంబరపడుతున్నారు. ఇప్పటికే రైతులు మొక్కజొన్న, పత్తి, మిర్చి, పంటలు సాగు చేశారు. నీరు రావడంతో వేల ఎకరాల్లో వరి పంట సాగు చేపడుతున్నారు.

సిద్ధాపురం చెరువు కింద

మండలంలోని సిద్ధాపురం చెరువు కింద 12 వేల ఎకరాల్లో రైతులు మాగాని భూములు దుక్కులు దున్ని వరి పంట సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. చెరువు కింద సిద్ధాపురం, పెద్దనంతపురం, సిద్ధపల్లి, బాపనంతపురం, వెంకటాపురం, ఎస్ఎన్ తండా, కృష్ణాపురం, అమలాపురం , ఆత్మకూరు, నల్లకాల్వ గ్రామాల్లో వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు.



సిద్ధాపురం చెరువు, తూము ద్వారా విడుదలవుతున్న నీరు

కరివేన చెరువుకు నీరు

సిద్ధాపురం చెరువుకు వచ్చే కృష్ణాజలాలు వివిధ గ్రామాల మీదుగా పంట కాలువల ద్వారా కరివేన చెరువుకు చేరుకుంటోంది. ఈ చెరువు కింద 12 వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు రైతులు ఈ నీటిని ఉపయోగించుకుంటున్నారు. మెట్ట భూములు కావడంతో వర్షాభావం వలన పంటలపై ఆశలు వదులుకున్న రైతులకు ఎత్తిపోతల పథకం నీరు ఊరటనిచ్చింది. మొక్కజొన్నకు రైతులు ఈ నీటిని పొలాలకు పారించుకొని పంటలను కాపాడుకున్నారు.

బాపనంతపురం పరిధిలో..

బాపనంతపురం గ్రామానికి సిద్ధాపురం చెరువు నుంచి వందల ఎకరాలకు సాగు నీరు రావడమే కాకుండా బాపనంతపురం చెరువుకు కూడా నీరు చేరుకుంది. ఈ నీరు 400 ఎకరాలకు పైగా వరి, మొక్కజొన్న పంటలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది.

పంటలకు ఇబ్బంది లేదు



కృష్ణాజలాలు సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల కావడంతో ఈ ఏడాది పంటలు పండిస్తున్నాం. ప్రస్తుతం వరి పంట వేస్తున్నాం. ఈ పంట పూర్తయితే రబీలో మినుము సాగు చేస్తాం.

–హనుమంతరెడ్డి, సిద్ధపల్లి

అంతా సస్యశ్యామలం



సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరురావడంతో ఈ ప్రాంతంతో పంటలు పండి సస్యశ్యామలమవుతుంది. మా గ్రామంలో ఇప్పటికే మొక్కజొన్న, వరి పంటలు వేశారు. ఎత్తిపోతల పథకం నుంచి నీరు రావడం ఈ పంటలకు ఎంతగానో ఉపయోగం. నీటి విడుదల కొనసాగితే రబీలో కూడా వరి పంట సాగు చేస్తాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్ధాపురం

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

మండల ఇన్‌చార్జ్‌గా తెలుగు నాగరాజు



పాములపాడు: సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌గా పాములపాడుకు చెందిన జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబరు తెలుగు నాగరాజు (టీఎస్‌ఆర్) ఎంపికయ్యారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సమన్వయకర్త చల్లా మధుసూదన్‌రెడ్డి తన పేరును ప్రకటిస్తూ ఆన్‌లైన్‌లో పొందుపర్చారని చెప్పారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 30 మంది కన్వీనర్లను, 463 మంది గృహ సారథులను త్వరలో ఎంపిక చేస్తామని వివరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ఎస్సీ, బీసీ, మసీద్‌లైన్ కాలనీల్లో చేపట్టిన నూతన సీసీ రహదారుల నిర్మాణాలను ఎంపీడీఓ గోపీకృష్ణ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలతో ఈ రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే రహదారులు మన్నికగా ఉంటాయని, అధికారుల సూచనల ప్రకారం క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, ఇంజనీరింగ్ రంజిత్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటి, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మహానంది: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశువైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సమయానికి టీకాలు, వ్యాక్సిన్లు వేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లావణ్యలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లె గ్రామంలోని వెటర్నరీ ఆస్పత్రిలో గురువారం రికార్డులు పరిశీలించి వీఎల్‌ఓ జె.సులోచనకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి గొర్రెలలో వచ్చే పారుడువ్యాధి నివారణకు టీకాల పంపిణీ ఉంటుందన్నారు. అంతకు ముందు ఆమె శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

వయసుతో సంబంధం లేకుండా నేత్రదానం



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి

మహానంది: వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయవచ్చని జిల్లా అంధత్వ నివారణ, కంటి వైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గాజులపల్లె ఆరోగ్య కేంద్రంలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.జగదీష్ చంద్రారెడ్డి, డాక్టర్ మద్దుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, మనం లేకపోయినా మనకళ్లు సజీవంగా ఉంటాయన్నారు. సీహెచ్‌ఓ పెంచలమ్మ, ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి, పీహెచ్ఎన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ సేవకులు



సన్మాన గ్రహీతతో ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్: ఉపాధ్యాయులు సమాజ సేవకులని దామగట్ల ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని దామగట్ల జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన అనితజీవన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెజీనా, శైలజ, విజయకుమారి, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మౌలాలిస్వామి సరిగెత్తు

పాములపాడు: మండల కేంద్రంలో గురువారం మౌలాలిస్వామి చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడీ వద్దకు భక్తులు విరివిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని కాయ, కర్పూరాలు సమర్పించారు. స్వామి వారికి పూల షస్రాలు, దట్టీలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి వారిని పీర్లచావిడి నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



ఆత్మకూరులోని ఓ దుకాణంలో యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న ఏడీఏ

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ ఆంజనేయులు హెచ్చరించారు. డివిజన్ పరిధిలో డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయించడంపై ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘యూరియా కృత్రిమ కొరత ’ కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాలతో పాటు పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండలాల్లోని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు ఎంత కావాలో అందుబాటులో ఉన్నాయని, రైతు భరోసా కేంద్రాల్లో కూడా రసాయనిక ఎరువులను నిల్వ ఉంచుతున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో 60 టన్నుల యూరియా, ప్రైవేట్ దుకాణాల్లో 71 టన్నుల యూరియా ఉందని, అలాగే అన్ని మండలాల్లో యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులను దుకాణ యజమానులు విక్రయించాలన్నారు. ఎక్కడైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఉద్యాన పంటల కలెక్షన్ సెంటర్ ప్రారంభం
- విత్తనాలు, రుణాల చెక్కు అందజేత



ఉద్యాన పంటల సేకరణ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమించటంతో పాటు వారికోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఉద్యానవన పంటల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రైతులకు పెట్టుబడి సహాయం అందజేయటంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, ఎప్పటికప్పుడు పంట నష్ట పరిహారం మంజూరు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్మించిన ఉద్యాన పంటల సేకరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులు అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. అనంతరం రైతులకు ఉచితంగా పలురకాల విత్తనాలు, రుణాల మెగాచెక్కును అందజేశారు. రైతులు, అధికారులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ మొట్టిబాలయ్య, ఎంపీటీసీ కృపాకర్, ఏసీ దేగలయ్య, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : రైతుల సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద జిల్లా షెడ్యూల్డ్ కులముల ఆర్థిక సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రైతుల కోసం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలను, ఎరువులను అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల రైతులకు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డితో కలిసి విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి జయలక్ష్మి, ఎంపీడీఓ శోభారాణి, జెడ్పీటీసీ కలిమున్నిసా, మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వనజ, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో చెంచులకు మేలు



మామిడి మొక్కలు నాటుతున్న ఐటీడీఏ అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఉద్యాన పంటల సాగుతో చెంచుగిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి. రవీంద్రారెడ్డి అన్నారు. గురువారం సున్నిపెంటలోని కుడుముల రవణమ్మ పొలంలో మామిడి మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని మూడు జిల్లాల్లో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మూడు వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద గిరిజనులకు 150 పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. సాగు భూముల్లో సరిహద్దు పంటలుగా టేకు, కొబ్బరి మొక్కలను నాటుకుని పొలం అంతా ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే చెంచుగిరిజనులు జీవితకాలం సుస్థిర ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చన్నారు. సున్నిపెంటలో 12 మంది చెంచుగిరిజనులకు 21 ఎకరాల్లో ఉద్యాన వన పంటలు వేసుకోవడానికి అనుమతి లభించిందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్, ఎస్ఎల్‌పీసీ మెంబర్ కుడుముల మూగెన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నందికొట్కూరు: వైఎస్సార్ బీమా పథకం పేదలకు ఓ వరమని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రాతకోట రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని 13వ వార్డులో వీరనాల లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మరణించాడు. కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ బీమా పథకం కింద ప్రభుత్వ తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జి, వలంటీర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

వెలుగోడు: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో అవసరమైన ఎరువులు ఉన్నాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. గురువారం గుంతకందాల, వెలుగోడు–3వ ఆర్‌బీకే కేంద్రాలను ఏవో సందర్శించి రైతులకు ఎరువులు అందజేశారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు.మండలంలో 107 టన్నుల యూరియా, 25 టన్నులు డీఏపీ ఎరువుల నిల్వ ఉన్నాయని, ఇంకా ఎవరైనా రైతులు ఏ రకమైన ఎరువులు కావాలన్నా సంబంధిత రైతు భరోసా కేంద్రం వద్ద నమోదు చేసుకుంటే వెంటనే అందిస్తామన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏఓ పవన్ కుమార్ తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు ఆంక్షలు విధించకూడదని సూచించారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకష్ణ, వెంకట శివ, అప్సర్, నాగమణి పాల్గొన్నారు.

వైభవంగా మౌలాలిస్వామి జార్తలు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో మౌలాలిస్వామి జార్తలు గురువారం రాత్రి వైభవంగా జరిగాయి. మౌలాలిస్వామి, దస్తగిరిస్వామి, చిన్నదస్తగిరి స్వామి, తదితర పీర్లస్వాములకు గ్రామస్తులు బాసికాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో గంధం, చక్కెర, చదివించి మొక్కులు తీర్చుకున్నారు. జార్తల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, చింతామణి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జార్తల ఉత్సవాలకు ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.30వేలు ఆర్థిక సహాయం అందించారు.

సంతమార్కెట్ ప్రారంభం

జూపాడుబంగ్లా: పారుమంచాలలో వినియోగదారులకు, వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేసిన నూతన సంతమార్కెట్‌ను సర్పంచ్ మాధవరం ప్రకాశం గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సంతమార్కెట్‌కు ప్రత్యేకంగా స్థలం లేకపోవటతో గ్రామంలోని గాం. దీవిగ్రహం వద్ద, వీధుల వెంట వారాంతపు సంతను నిర్వహించే వారమన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామసచివాలయం ఆవరణలో ఉన్న స్థలాన్ని చదునుచేయించి సంత మార్కెట్ నిర్వహణకు అనుకూలంగా మార్చామన్నారు. భవిష్యత్‌లో షెడ్లు నిర్మించి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరేలా చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్ణ, రసూల్, మాధవరం రంగస్వామి, పెద్దన్న, ఏసన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మానసిక చైతన్యంపై అవగాహన అవసరం

నందికొట్కూరు: మానసిక చైతన్యం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అశ్వ గ్రూపు, అకాడమీ ఆఫ్ హ్యూమన్ (ఏఓహెచ్‌ఈ) వ్యవస్థాపకులు వెంకట్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏఓహెచ్‌ఈ ఆధ్వర్యంలో బాలికలకు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల కోసం జీవన నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. దైనందిన జీవితంలో వీటిని అమలు చేయడం ఎంతో ముఖ్యమో వివరించారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పల్లకీ మోస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి



పారుమంచాలలో జరిగిన వేడుకల్లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

నందికొట్కూరు:పట్టణంలో శ్రీ ప్రబోధానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ముగిశాయి. శ్రీ కృష్ణుడి విగ్ర హాన్ని పురవీధుల వెంట పల్లకీలో ఊరేగించారు. పల్లకీని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మోసి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు రూపాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీఆర్ శ్రీను, రజినీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే కాటసాని

జూపాడుబంగ్లా:మండలంలోని పారుమంచాలలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ దేవస్థాన అర్చకులు వేదమంత్రాలతో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో గ్రామపురవీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణపరమాత్ముని కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి సతీమణి అపర్ణ, శ్రీనివాసరెడ్డి, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


ఆత్మకూరు: మండలంలోను, పట్టణంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా సాగాయి. కరివేన, శ్రీపతిరావు పేట, కృష్ణాపురం, వడ్లరామాపురం, సిద్ధపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణుడి చిత్రపటాలతో ట్రాక్టర్ల ఊరేగించారు. యాదవ సోదరులు ఉట్టిని పగలగొట్టే కార్యక్రమం నిర్వహించారు.

వెలుగోడు: కృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలరించారు. చిన్నారులు ఉట్టి కొడుతున్న దృశ్యాలు కనువిందు చేశాయి. స్కూలు బయట, వినాయకుని గుడి వద్ద ఎంపీపీ లాలం రమేష్ శ్రీకష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీరాములు సూచించారు. గురువారం మండలంలోని ముసలిమడుగు జెడ్పీహెచ్ఎస్, పెద్దగుమ్మడాపురం, శివపురం గ్రామాలలోని ఎంపీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 23 పాఠశాలలో రెండవవిడత నాడు–నేడు పనులు జరుగుతున్నాయన్నారు.వీటిలో 75 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



చంద్రశేఖర్ నాయుడు(ఫైల్)

మిడుతూరు: కౌలు రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన 49–బన్నూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు చింతలపల్లి గ్రామానికి చెందిన బోయ కొట్టం చంద్రశేఖర్ నాయుడు (36) బన్నూరు పొలిమేరలో ఉన్న పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. పొలంలో భార్య లక్ష్మీదేవితో పాటు కొంతమంది కూలీలతో మిరపనారు నాటడానికి వెళ్లారు. పొలానికి నీరు పెట్టి నారు నాటుతుండగా సాయంత్రం 4 గంటల సమయంలో బోయ చంద్రశేఖర్ నాయుడుకు విద్యుత్ తీగలు తగడంతో షాక్‌గు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య కళ్లెదుటే విగతజీవిగా మరడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతునికి భార్య లక్ష్మీదేవి, కూతురు ప్రవల్లిక, కుమారుడు గౌతం, తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ కూలీల ఆటో బోల్తా

కొత్తపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో తొమ్మిది మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. పాములపాడు మండల కేంద్రానికి చెందిన భాగ్యమ్మ, చిట్టి, షెమ్నూన్, అమిరున్‌బీతో పాటు మరో ఐదుగురు వ్యవసాయ కూలీలు ఆటోలో కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామం శివారులో రైతు శివ సాగు చేసిన వరి పొలంలో పనులకు బయలుదేరారు. కొత్తమాడుగుల, ఎం.లింగాపురం గ్రామాల రహదారిలో క్రషర్ పాయింట్ వద్ద ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న సైడు కాల్వలో బోల్తాపడింది. చుట్టుపక్కల పొలాల్లో ఉన్నవారు గమనించి ఆటోలో ఉన్నవారిని బయటికి తీసి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్వల్పగాయాలైన వారికి వైద్యులు ప్రథమచికిత్స అందించి భుజం, పక్కటేకములు, చేతిఎముకలు విగిరిన భాగ్యమ్మ, చిట్టి, షెమ్నూన్, అమిరున్‌బీలను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్‌చేశారు. కాగా ఈవిషయమై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్ఐ హుస్సేన్‌బాషా తెలిపారు.

బోర్లతో తాగునీటి సమస్య పరిష్కారం

పాములపాడు: గ్రామంలో బోర్ల నిర్మాణం చేపట్టడంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని సర్పంచు మొల్ల అఖ్తరున్నిసా అన్నారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో 2, మజరా కృష్ణానగర్ గ్రామంలో 2 చొప్పున బోర్లు వేయించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరం వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తుతుందన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. సమస్య ఎక్కువగా ఉన్న కాలనీల్లో బోర్లు వేయించుకునేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ మేరకు గ్రామ పంచాయతీలో 4 బోర్లు వేస్తున్నట్లు వివరించారు. బోర్లలో నీరు పుష్కలంగా పడినట్లు చెప్పా రు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు జబ్బార్, శ్రీనివాసులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల విరాళం



డప్పులు అందుకున్న కళాకారులతో సొసైటీ చైర్మన్, కమిటీసభ్యులు

పాములపాడు: మండల కేంద్రంలోని 12 మంది డప్పు కళాకారులకు వేంపెంట సింగిల్ విండో సొసైటీ చైర్మన్ తెలుగు వెంకటస్వామి డప్పులను విరాళంగా అందజేశారు. మండల కేంద్రంలో గురువారం మౌలాలి స్వామి సరిగెత్తు సందర్భంగా పీర్లచావిడి వద్ద డప్పు కళాకారులు డప్పులు కావాలని అడగడంతో స్పందించిన ఆయన వెంటనే దాదాపు రూ.25వేల ఖర్చుతో డప్పులు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడు ముందుంటామన్నారు. అనంతరం డప్పు కళాకాలరులు సొసైటీ చైర్మన్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగరాజు, సరిగెత్తు కమిటీ సభ్యులు పెద్ద స్వామి, శ్రీకృష్ణ, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు అధికారం చేపట్టాలి

ఆత్మకూరు: దేశంలో బహుజనులు అధికారం చేపట్టాలని బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గం అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు మహేంద్ర , నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మౌలాలి, నందికొట్కూరు ఇన్‌చార్జ్‌స్వాములు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో శ్రీశైలం నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఎస్‌పీలో చేరారు. అనంతరం శ్రీశైలం నియోజకవర్గం బీఎస్‌పీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామకృష్ణ, ఉపాధ్యక్షులు వినోద్, కన్వీనర్‌గా శ్యామ్, ట్రెజరర్‌గా గౌస్, ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా ప్రేమ్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌ను ఎన్నుకున్నారు.

కూర్చున్నోడు కూర్చున్నట్లే మృత్యు ఒడిలోకి

మహానంది: హోటల్ పెట్టుకుని టీ, బిస్కట్లు అమ్ముకుంటూ జీవనం సాగించే పటాల బాబు(47) కూర్చున్నోడు కూర్చున్నట్లే మృత్యువాత పడిన సంఘటన మహానందిలో గురువారం విషాదం కలిగించింది. మహానందిలోని ఈఓ కాటేజీ వెనుక పటాల బాబు చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం నుంచి వ్యాపారం చేసుకుంటున్న ఆయన సాయంత్రం టీ తాగుతుండగా హఠాన్మరణం చెందాడు. బాపట్లకు చెందిన బాబు గత కొన్నేళ్ల క్రితం మహానందికి వలస వచ్చి మొదటగా పటాల వ్యాపారం చేసేవాడు. రెండేళ్ల నుంచి కుమారుడు, భార్య తిరుపతిలో ఉంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన కార్పెంటర్ నాగబ్రహ్మయ్య ఆచారి గురువారం శిరివెళ్ల మండలం గుండంపాడులో పనులు చేసి బైక్‌పై ఇంటికి వస్తుండగా పెట్రోల్‌బంకు వద్ద గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న క్రాంతి ట్రాన్స్‌పోర్టుకు చెందిన వాహనం బైకును ఢీకొంది. ఈ సంఘటనలో బ్రహ్మయ్య ఆచారి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.